డ్రంకన్‌ డ్రైవ్‌లో 71 మందిపై కేసు

కుత్బుల్లాపూర్‌: సైబరాబాద్‌ ట్రాఫిక్‌ సీపీ పరిధిలో శనివారం స్పెషల్‌ డ్రంకన్‌ డ్రైవ్‌ నిర్వహించారు. బాలానగర్‌ ట్రాఫిక్‌ పీఎస్‌ పరిధిలో 30 మంది, జీడిమెట్ల ట్రాఫిక్‌ పీఎస్‌ పరిధిలో 20 మంది, అల్వాల్‌ ట్రాఫిక్‌ పీఎస్‌ పరిధిలో 21 మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతు పట్టుబడ్డారు. వారిపై కేసులు నమోదు చేసిన ట్రాఫిక్‌ పోలీసులు చలాన్లు విధించారు.

గురుకులాల కార్యదర్శిని సస్పెండ్‌ చేయాలి

కేవీపీఎస్‌ జిల్లా కార్యదర్శి బాలపీరు

నిజాంపేట్‌: దళిత విద్యార్థులు బాత్‌రూములు కడుక్కోవాలని వ్యాఖ్యలు చేసిన గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిణీని వెంటనే సస్పెండ్‌ చేయాలని కేవీపీఎస్‌ జిల్లా కార్యదర్శి బాలపీరు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేశంలో వేల సంవత్సరాల నుంచి అన్ని రకాల అవమానాలను భరిస్తున్న దళిత విద్యార్థులు భావి భారత పౌరులుగా ఎదిగే తరుణంలో ఐఏఎస్‌ అధికారి అలా వ్యాఖ్యానించడం సరికాదన్నారు. తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్‌ చేశారు. లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఉత్తమ ఫైర్‌స్టేషన్‌ అధికారిగా శేఖర్‌రెడ్డి

జీడిమెట్ల: జీడిమెట్ల ఫైర్‌ స్టేషన్‌ ఆఫీసర్‌ శేఖర్‌ రెడ్డి ఉత్తమ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ఆదివారం డైరెక్టర్‌ జనరల్‌ తెలంగాణ డిజాస్టర్‌ రెస్పాన్స్‌ అండ్‌ ఫైర్‌ సర్వీసెస్‌ హైదరాబాద్‌ వారు ప్రకటించిన లిస్ట్‌లో జీడిమెట్ల ఆఫీసర్‌ పేరును ప్రకటించారు. ఉత్తమ ఉద్యోగిగా శేఖర్‌ రెడ్డి ఎంపికవ్వడం పట్ల జీడిమెట్ల ఫైర్‌ స్టేషన్‌ సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతా

కుత్బుల్లాపూర్‌: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని బీఆర్‌ఎస్‌ విప్‌, ఎమ్మెల్యే వివేకానంద్‌ అన్నారు. ఆదివారం బహదూర్‌పల్లిలోని ప్రణీత్‌ ప్రణవ్‌ ఫ్లోరాలో పర్యటించారు. తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, రోడ్లు తదితర సమస్యలను కాలనీ ప్రతినిధులు ఎమ్మెల్యేకు వివరించారు. కొంపల్లి నుంచి గచ్చిబౌలి వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ డైరెక్టర్లు విజయ భాస్కర్‌రెడ్డి, దయాకర్‌ రెడ్డి, హనుమ సతీష్‌, అసోసియేషన్‌ సభ్యులు అడ్వకేట్‌ రవి కుమార్‌రెడ్డి, శివ కుమార్‌, రవితేజ, మద్దిపట్ల సాయికిరణ్‌, శ్రీకాంత్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఐ క్యాంప్‌ అభినందనీయం

నిజాంపేట్‌: ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని లుక్స్‌ గ్లోబల్‌ ఫౌండేషన్‌, కారుణ్య వెల్ఫేర్‌ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత మెగా ఐ క్యాంప్‌ నిర్వహించడం అభినందనీయమని బాచుపల్లి సీఐ ఉపేందర్‌ అన్నారు. ఆదివారం నిజాంపేట్‌ బండారి లే అవుట్‌లోని రాజధాని స్కూల్‌లో ఉచిత మెగా కంటి పరీక్షల శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రతి ఒక్కరికి కండ్లు చాలా ముఖ్యమైనవని అన్నారు. మొబైల్‌ వాడకం తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో లుక్స్‌ గ్లోబల్‌ ఫౌండేషన్‌ ఫౌండర్‌ చైర్మన్‌ భిక్షపతి యాదవ్‌, కారుణ్య వెల్ఫేర్‌ సొసైటీ అధ్యక్షులు దాసి నాగరాజు, ఎల్‌జీఎఫ్‌ కో ఫౌండర్‌ కోమల భిక్షపతి యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలి

రాయదుర్గం: విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని తెలంగాణ ఎడ్యుకేషన్‌ కమిటీ సభ్యుడు, హెచ్‌సీయూ ప్రొఫెసర్‌ నాగరాజు పేర్కొన్నారు. గౌలిదొడ్డిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం నెలరోజులపాటు నిర్వహించిన ప్రత్యేక శిబిరం ఆదివారం ముగిసింది. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జర్నలిస్టు సొసైటీ అధ్యక్షుడు గోపరాజు మాట్లాడుతూ.. అడ్డంకులను లెక్క చేయకుండా విద్యపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుజన్‌రంజన్‌రావు, ఆచార్య కమలాకర్‌, డెర్మటాలజిస్ట్‌ డాక్టర్‌ అలేఖ్యసింగపూర్‌ పాల్గొన్నారు.

'ప్రజా సంక్షేమమే ధ్యేయం'

మియాపూర్‌: మియాపూర్‌ డివిజన్‌ పరిధిలోని మందాడి మాగ్నస్‌ అపార్ట్‌మెంట్‌ రెసిడెన్షియల్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు.నూతన అసోసియేషన్‌ సభ్యులను ఎన్నుకున్న సందర్భంగా ఎమ్మెల్యేను కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. కాలనీలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌, అపార్ట్‌మెంట్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు రామ సుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు సుదాకర్‌రెడ్డి, వెంకట్‌, నాగరాజు, దిలీప్‌ కుమార్‌ పాల్గొన్నారు.

గంటల తరబడి క్యూ!

ప్రకృతి విపత్తుల దృష్ట్యా మూడు నెలల రేషన్‌ ఒకే సారి పంపిణీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. బియ్యం పంపిణీ ఆదివారం ప్రారంభమైంది. మూడు నెలలకు సరిపడా బియ్యం ఇస్తుండటంతో లబ్ధిదారులు ఒక్కసారిగా రేషన్‌ దుకాణాల వద్ద క్యూ కట్టారు. సర్వర్‌డౌన్‌ సమస్యతో డీలర్లు, లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. కొత్త సాఫ్ట్‌వేర్‌పై సరైన అవగాహన లేక తిప్పలు తప్పలేదు.

- మూడు నెలల బియ్యం పంపిణీకి మొదటి రోజే కష్టాలు
- సర్వర్‌డౌన్‌తో మరింత ఆలస్యం
- డీలర్లపై లబ్ధిదారుల ఆగ్రహం



మోతీనగర్‌లో రేషన్‌ దుకాణం వద్ద ఎండకు తలపై సంచులతో నిలబడ్డ లబ్ధిదారులు

కూకట్‌పల్లి: జంట సర్కిళ్ల పరిధిలోని కూకట్‌పల్లి, మోతీనగర్‌, ఆల్విన్‌కాలనీ, బాలానగర్‌ మూసాపేట పరిధిలోని పలు రేషన్‌ దుకాణాలలో లబ్ధిదారులు రేషన్‌షాపుల వద్ద పడిగాపులు కాశారు. సర్వర్‌ డౌన్‌ సమస్యంతో మరింత కష్టాలు ఎదురయ్యాయి. కొన్ని రేషన్‌ దుకాణాల్లో సర్వర్‌ వస్తూ పోతూ ఉండటంతో సమయం ఎక్కువగా పట్టింది. దీంతో ప్రజలు అసహనానికి గురయ్యారు. డీలర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో గత్యంతరం లేక డీలర్లు దుకాణాలను మూసివేశారు. మూడు నెలల రేషన్‌ పంపిణీ చేస్తుండటంతో ప్రజలు కూడా ఇతర



కూకట్‌పల్లిలోని రేషన్‌ షాపు వద్ద సర్వర్‌ డౌన్‌ సమస్యతో వేచి చూస్తున్న లబ్ధిదారులు

పనులు పక్కకిపెట్టి దుకాణాల వద్ద క్యూలో నిలబడ్డారు. ఎండతాకిడికి నెత్తి మీద వారు తెచ్చుకున్న సంచులను పెట్టుకుని తమ వంతు ఎప్పుడు వస్తుందా? అని వేచి చూశారు.

నానా తిప్పలు పడ్డాను



బియ్యం తీసుకోవడానికి నానా తిప్పలు పడ్డాను. ప్రతి నెలా బియ్యం ఇచ్చిన ట్లుగానే ఇస్తే ఇబ్బందులు ఉండేవి కావు. ఎప్పుడు కూడా షాపుల ముందు ఇంత వేచి ఉన్న పరిస్థితి చూడలేదు. కేవలం పది నిమిషాల్లోనే బియ్యం తీసుకునే వాళ్లం. ఎండ వేడి ఎక్కువగా ఉండటంతో ఇబ్బంది పడ్డాను. ఉన్నతాధికారులు సర్వర్‌ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

– ఎస్‌. రమ్యశ్రీ, రాజీవ్‌గాంధీ నగర్‌ నివాసి

డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్‌ నర్సింహయాదవ్‌

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: కారు, ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారంలో తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్‌ ముద్దం నర్సింహయాదవ్‌ అన్నారు. ఆదివారం కారు, ఆటో డ్రైవర్స్‌ యూనియన్‌ నాయకులు తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రైవర్లకు తోడ్పాటు అందించాలని రెండు నెలల క్రితం కేటీఆర్‌తో యూనియన్‌ కార్యాలయాన్ని ప్రారంభించామని తెలిపారు. డ్రైవర్లు యూనిట్‌గా ఉంటు వారికి వ్యక్తిగతంగా సమస్యలు వచ్చిన, కుటుంబ పరంగా సమస్యలు వచ్చిన అందరు ఐక్యంగా ఉంటూ పరిష్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం యూనియన్‌ నాయకులు కార్పొరేటర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్‌ అధ్యక్షుడు స్వామి, ఉపాధ్యక్షుడు వెంకటయ్య, రాము, ప్రధాన కార్యదర్శి నాగరాజు, సెక్రటరీ రాజేశ్‌, కోశాధికారి జూకంటి రాజేష్‌, జాయింట్‌ సెక్రటరీ ప్రశాంత్‌, ఎం శంకర్‌, రితీష్‌, నవీన్‌, విజయ్‌, శ్రీకాంత్‌, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కరాటే శిక్షణ ముగింపు



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న కార్పొరేటర్‌ పండాల సతీష్‌గౌడ్‌ తదితరులు

బాలానగర్‌: ఫతేనగర్‌ డివిజన్‌లోని భగత్‌సింగ్‌ పార్కులో 45 రోజుల పాటు ఉచిత కరాటే శిక్షణ ఆదివారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్‌ పండాల సతీష్‌ గౌడ్‌ హాజరై శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవి సెలవులను వృథా చేయకుండా శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. సుమారు 100 మంది విద్యార్థులు శిక్షణ తీసుకున్నారు. కోచ్‌ దుర్గారావుని సన్మానించారు. కార్యక్రమంలో పవర్‌ లిఫ్టింగ్‌ కోచ్‌ ఆనంద్‌, ప్రవీణ్‌, మిశ్రా, కరాటే అసోసియేషన్‌ అధ్యక్షులు శ్రీనివాస్‌, సభ్యులు బాబుగౌడ్‌, బాలచందర్‌ గౌడ్‌, భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల అంతమే ఆపరేషన్‌ సిందూర్‌ లక్ష్యం



ర్యాలీలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు యాదవ్‌ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఉగ్రవాదుల అంతమే ఆపరేషన్‌ సిందూర్‌ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. స్వామి వివేకానంద యూత్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలనీలోని సాయినగర్‌లో శనివారం రాత్రి తిరంగా ర్యాలీని యూత్‌ అధ్యక్షులు లంగటి నరేందర్‌ రెడ్డి ఆధ్వర్యంలో, కుమార్‌ యాదవ్‌, శ్రీనాథ్‌ల అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆపరేషన్‌ సిందూర్‌ విజయం చరిత్రలో మరిచిపోలేనటువంటి దినమన్నారు. భారత్‌పై పాకిస్థాన్‌ ఎన్ని కుట్రలు చేసినా ఆ దేశానికి ఎదుర్కొనే శక్తి లేదన్నారు. ఉగ్రవాదుల ఎయిర్‌ బేస్‌లను కూల్చి ఉగ్రవాదుల గుండెల్లో వణుకు పుట్టేలా మన సైనికులు పని చేశారన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్‌రావు, డాక్టర్‌ కొరడాల నరేష్‌, నాయకులు రామరాజు, దుర్గప్రసాద్‌, రమేష్‌, కాలనీల కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

రేపు జేఎన్‌టీయూ స్నాతకోత్సవం



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ వీసీ కిషన్‌ కుమార్‌ రెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ: జవహర్‌లాల్‌ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం 13వ స్నాతకోత్సవాన్ని మంగళవారం వర్సిటీలోని ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు జేఎన్‌టీయూ వీసీ టి. కిషన్‌ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ హాజరు కానున్నారని పేర్కొన్నారు. అదే విధంగా గౌరవ డాక్టరేట్‌ను ఆలిండియా కౌన్సిల్‌ ఫర్‌ టెక్నికల్‌ ఎడ్యుకేషన్‌ చైర్మన్‌(ఏఐసీటీఈ) టి.జి సీతారామ్‌కు ఇవ్వనున్నట్లు తెలిపారు. జేఎన్‌టీయూహెచ్‌ నేషనల్‌ అసైన్‌మెంట్‌లో ఏ+ గ్రేడ్‌ దక్కిందని, ఇంజినీరింగ్‌ స్ట్రీమ్‌లో దేశ వ్యాప్తంగా 88వ ర్యాంకు విశ్వ విద్యాలయంకు దక్కిందని తెలిపారు. యూజీ కోర్సులు, పీజీ కోర్సులలో సిలబస్‌ను రూపొందిస్తున్నామని, ఉపాధి, నైపుణ్య అవసరాలకు అనుగుణంగా సిలబస్‌ను సవరిస్తున్నట్లు పేర్కొన్నారు. స్నాతకోత్సవంలో 92,118 డిగ్రీలు, డాక్టర్‌ ఆఫ్‌ ఫిలాసఫీ 24,174 మందికి బంగారు పతకాలు అందజేయనున్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో విశ్వ విద్యాలయం, కళాశాలలకు చెందిన 791 మంది విద్యార్థులు క్యాంపస్‌ ప్లేస్‌మెంట్స్‌కు ఎంపిక అయ్యారని పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్‌ సెల్‌, జేఎన్‌టీయూకు హరితహారం అవార్డు, ఎన్‌ఎస్‌ఎస్‌ జాతీయ అవార్డులు దక్కాయని పేర్కొన్నారు. సమావేశంలో రెక్టార్‌ విజయ్‌కుమార్‌ రెడ్డి, రిజిస్ట్రార్‌ వెంకటేశ్వరరావు, వివిధ విభాగాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ.. సన్మానం

కూకట్‌పల్లి: తెలంగాణ పోలీస్‌ డిపార్టుమెంట్‌లో 35 సంవత్సరాలుగా సేవలందించి రిటైర్డ్‌ సందర్భంగా అశోక్‌ని కూకట్‌పల్లి వై జంక్షన్‌లోని అభినందన్‌ హోటల్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆదివారం సన్మానించారు. రిటైర్‌మెంట్‌ జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా, సంతోషంగా గడపాలని కోరారు.

బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందజేయాలి



వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్‌ రవీందర్‌ రెడ్డి

బాలానగర్‌: బాలానగర్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రసవం కోసం వచ్చిన తల్లి, బిడ్డ చనిపోవడం బాధాకరమని, బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారాన్ని అందజేయాలని కార్పొరేటర్‌ ఆవుల రవీందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఘటన వివరాలు తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ వాడకాన్ని తగ్గిద్దాం



క్లాత్‌ సంచులను అందజేస్తున్న లయన్‌ అన్నెం కోటిరెడ్డి

బాలానగర్‌: ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ వాడకాన్ని తగ్గించి మార్కెట్‌కు వెళ్లేటప్పుడు క్లాత్‌, జ్యూట్‌ బ్యాగులు వాడాలని పర్యావరణ పరిరక్షణ సమితి చైర్మన్‌ లయన్‌ అన్నెం కోటిరెడ్డి అన్నారు. ఆదివారం బాలానగర్‌లోని ఫ్రూట్‌ మార్కెట్‌లో ప్లాస్టిక్‌ సంచుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ప్లాస్టిక్‌ కవర్లకు బదులుగా క్లాత్‌ సంచులు వాడాలని సంచులను పలువురికి ఉచితంగా అందజేశారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఠాకూర్‌ అంకిత్‌సింగ్‌



ఠాకూర్‌ అంకిత్‌ సింగ్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ తులసినగర్‌ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికలు ఆదివారం స్థానిక కమిటీ హాల్‌లో నిర్వహించారు. అధ్యక్షుడిగా ఠాకూర్‌ అంకిత్‌ సింగ్‌ సమీప అభ్యర్థి సూర్యచంద్రంపై గెలుపొందారని ఎన్నికల అధికారులు కె. సురేందర్‌, ఎస్‌.జి.వి. ప్రసాద్‌రావు తెలిపారు. అనంతరం అధ్యక్షుడిగా ఎన్నికైన ఠాకూర్‌ అంకిత్‌ సింగ్‌ మాట్లాడుతూ.. కాలనీలోని సమస్యలను దశలవారీగా పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. అందరి సహకారంతో కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు.

లీకేజీలతో తాగునీరు వృథా!

- కలుషితమవుతున్న జలాలు
- రోగాల బారిన ప్రజలు
- అధికారుల తీరుపై కాలనీ వాసుల ఆగ్రహం

లీకేజీలతో తాగునీరు వృథా అవుతోంది. దీనికి తోడు లీకేజీ ప్రాంతంలో కలుషిత నీరు చేరుతోంది. అదే నీరు సరఫరా కావడంతో గత్యంతరం లేక వాటిని వేడి చేసుకొని తాగుతున్నామని కూకట్‌పల్లి సర్కిల్‌ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లీకేజీలు అయి నెలలు గడుస్తున్నా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించటం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఆస్‌బెస్టాస్‌ కాలనీ ప్రధాన రహదారిలో లీకేజీతో రోడ్డుపై పారుతున్న తాగునీరు



ఆల్విన్‌కాలనీ ఎస్‌ఎస్‌డీ స్కూల్‌వద్ద ఉన్న నాలాకు ఆనుకొని ఉన్న ప్రధాన మంచినీటి పైపులైన్‌ లీకేజీ



పాపిరెడ్డినగర్‌లో సమ్మక్క సారలమ్మ దేవాలయం వద్ద రోడ్డుపై పారుతున్న తాగునీరు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ పైపులైన్‌ రోడ్డు, ఎస్‌ఎస్‌డీ స్కూల్‌ సమీపంలోని బ్రిడ్జి వద్ద ప్రధాన పైపులైన్‌పై ప్రయాణించే వాహనాల ధాటికి పైపులైన్‌లు పగిలి గుంతగా ఏర్పడింది. కొన్ని నెలలుగా తాగునీరు కలుషితమై సరఫరా అవుతుంది. అదే విధంగా ఆస్‌బెస్టాస్‌ కాలనీ పార్కు సమీపంలోని స్వీట్‌షాపు మూలమలుపు వద్ద, పాపిరెడ్డినగర్‌ సమ్మక్క, సారాలమ్మ దేవాలయం సమీపంలో మంచినీటి పైపులైన్‌ లీకేజీ, వాల్వ్‌ లీకేజీ ద్వారా లక్షలాది గ్యాలన్ల తాగునీరు రోడ్లపై పారుతున్నది. ప్రతి రోజూ లీకేజీల కారణంగా నీరు రోడ్డుపై ప్రవహించి రహదారులు సైతం గుంతలమయంగా మారుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



తాగునీటిలో కలుషిత జలాల సరఫరాతో రోగాల భారిన పడుతున్నాం. లీకేజీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి. లీకేజీలు అరికట్టినా కొద్ది రోజుల్లోనే అదే ప్రాంతంలో సమస్య తిరిగి ఏర్పడుతోంది. పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదు. రానున్నది వర్షాకాలం. ఇదేవిధంగా కలుషిత జలాలు సరఫరా అయితే ప్రజల పరిస్థితి అగమ్య గోచరంగా మారుతుంది. అధికారులు ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం చూపాలి – భాస్కర్‌రెడ్డి, స్థానికుడు